సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 2 । జనవరి । 2023



వాలీబాల్ మెరికలు
రామాయణంలో వాలిలా.. కడప వాలీబాలికలు ప్రత్యర్థులపై సత్తాచాటుతూ చాంపియన్‌లుగా నిలుస్తున్నారు. - 8లో



డ్యూక్ బైక్ తెచ్చిన అనర్థం
డ్యూక్‌బైక్‌ను రోడ్డుపై వేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. - 8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
33.4/17.3

జిల్లాలో ఆదివారం 17.3 - 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

పెన్షన్ల పండగ

- జిల్లాలో మొత్తం పింఛన్లు 2,56,847
- రూ 70.89 కోట్లకు పైగా పంపిణీకి చర్యలు
- ప్రారంభమైన పింఛన్ల పంపిణీ వారోత్సవాలు
- పెరిగిన పింఛన్ సొమ్ము, కొత్త పింఛన్ల మంజూరుతో అవ్వాతాతల ముఖాల్లో సంతోషం



కడప నగరంలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప రూరల్: కొత్త ఏడాది వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 'వైఎస్సార్ పింఛన్ కానుక' కింద వలంటీర్ల ద్వారా పండుటాకులకు పెంచిన పింఛన్, కొత్త పింఛన్ల మంజూరు రూపంలో 'కానుక' వచ్చింది. ఆదివారం తెల్లవారుజామునే ఆయా ప్రాంతాల్లోని వలంటీర్‌లు ఉత్సాహంగా కదిలారు. అర్హుల ఇళ్ల వద్దకు వెళ్లారు. తలుపుతట్టి అవ్వాతాతలు, అభాగ్యులను పలకరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. పింఛన్ల పంపిణీ వారోత్సవాల్లో భాగంగా పింఛన్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టారు.

సీఎం వైఎస్ జగన్ లేఖ అందజేత

జిల్లాలో 16 కేటగిరీలకు చెందిన పింఛన్‌లు మొత్తం 2,56,847 ఉన్నాయి. అందులో ఒకరికి రూ 2,500 నుంచి రూ 2750కు పెంపుదల చేసిన పింఛన్లు 2.11 లక్షలు ఉన్నాయి. వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాసిన లేఖలతో పాటు పెరిగిన సొమ్మును వలంటీర్‌లు పింఛన్‌దారులకు అందజేశారు. అలాగే కొత్తగా మంజూరైన పింఛన్‌లు మొత్తం 7,609 ఉన్నాయి. వారందరికీ పింఛన్ నగదుతో పాటు పింఛన్ ఐడీ, పాసు పుస్తకం ఇచ్చారు. ఇలా మొత్తం 2,56,847 పింఛన్లకు గాను రూ. 70.89 కోట్లు పంపిణీకి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా అన్ని చర్యలు చేపట్టింది. ఈ పింఛన్ల వారోత్సవాల్లో భాగంగా కడప నగరంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మిగతా నియోజకవర్గాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పింఛన్లను పంపిణీ చేశారు. ఠంచన్‌గా ప్రతి నెలా ఒకటవ తేదీనే పింఛన్ ఇంటి వద్దకే రావడం..అనుకున్న ప్రకారం పింఛన్‌ల సొమ్మును పెంపుదల చేయడం ..కొత్త పింఛన్లను మంజూరు చేయడం పట్ల పండుటాకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులైన ఏ ఒక్కరికీ పింఛన్లు దూరం కావు : ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: అర్హులైన ఏ ఒక్కరికీ పింఛన్లు దూరం కావని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక 25, 34 డివిజన్లలో జగనన్న ప్రభుత్వం పెంచి ఇస్తున్న పెన్షన్ కానుకను ఆయన ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ గత ప్రభుత్వం పింఛన్లు ఎలా తగ్గించాలా అనే కోణంలో ఆలోచించిందని, తమ ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలనే దిశగా ఆలోచిస్తోందన్నారు. కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ అనే తారతమ్యం లేకుండా లంచాలు, వివక్షకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఏ కారణం చేతనైనా అర్హులెవరైనా మిగిలిపోతే వారికి మరో అవకాశం ఇస్తామన్నారు. పింఛన్‌ను రూ.3వేలకు పెంచుకుంటూ పోతానని పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని రెండోసారి రూ.2,750కి పెంచి ఇవ్వడం సంతోషదాయకమన్నారు. పింఛన్ పెంచి ఇవ్వడంతోపాటు కొత్త పింఛన్లు కూడా కొత్త ఏడాది నుంచే ఇవ్వడం పట్ల అవ్వాతాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ కె.సూర్యనారాయణ రావు, 34వ డివిజన్ ఇన్‌చార్జి అలీఅక్బర్, వైఎస్సార్ సీపీ నాయకులు పి.జయచంద్రారెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, షఫీ, తోటకృష్ణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న మేలు మరువలేను



ఈ అబ్బాయి పేరు సత్యసాయి, దివ్యాంగుడు. కడప నగరం అరవింద్‌నగర్‌లో ఉంటున్నాడు. ఉదయాన్నే ఆ ప్రాంత వలంటీర్ లక్ష్మీప్రసన్న వెళ్లి పింఛన్ నగదును అందజేసింది. డబ్బును తీసుకున్న సత్యసాయి. సంతోషం వ్యక్తం చేశాడు. తన లాంటి వారు ఎంతో మంది కదలలేని పరిస్థితిలో ఉన్నారు. మా లాంటి వారికి ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగనన్న మేలు మరువలేమని తెలిపాడు.

పింఛన్ సొమ్మును పెంచినందుకు సంతోషం



ఈ ఫొటోలో వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్న వృద్ధురాలి పేరు జయమ్మ. కడపలోని అరవిందనగర్‌లో నివసిస్తోంది. వేకువజామునే ఆ ప్రాంత వలంటీర్ రామలోకం వెళ్లి రూ. 2,500 నుంచి రూ. 2,750కు పెరిగిన పింఛన్ నగదును అందజేశారు. ప్రభుత్వం పింఛన్ సొమ్మును పెంచడంతో జయమ్మ సంతోషం వ్యక్తం చేసింది. మా ముఖ్యమంత్రి జగనయ్య ఇచ్చిన మాట ఎప్పుడూ తప్పడంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం



విద్యుత్ దీపాలంకరణలో ఒంటిమిట్ట కోదండరామాలయం

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో సోమవారం జరగనున్న వైకుంఠ ఏకాదశి వేడుకకు టీటీడీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు మాట్లాడుతూ భక్తులకు ప్రణాళిక బద్ధంగా సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకునేందుకు దక్షిణ వైపు నుంచి ఉత్తర ద్వారం వరకు పొడవాటి క్యూలైన్ ఏర్పాటు చేశామన్నారు. ఆలయం లోపల కూడా గర్భాలయం చుట్టూ ప్రత్యేకమైన క్యూ లైన్ ఉందన్నారు. దాతల సాయంతో బొలి నరసింహులు ఆధ్వర్యంలో రూ. 2లక్షల 50 వేల విలువ గల పలు రకాల పూలను ఆలయ అలంకరణకు తెప్పించామని తెలిపారు. అలాగే భక్తులకు నీరు, అన్న ప్రసాదాల సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట బందోబస్తు ఉంటుందని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు విలేకరులకు తెలిపారు.

దేవుని కడపలో



దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం ఉత్తర ద్వారం ఏర్పాటుచేసిన స్వాగత తోరణం

కడప కల్చరల్: వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి సందర్భంగా దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం వద్ద ఆర్చిని ఏర్పాటు చేశారు. క్యూలైన్లు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుద్దీపాల కటౌట్లు అందరినీ ఆకర్షిస్తున్నాయి.

పుష్పగిరిలో...

వల్లూరు: పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ అర్చకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వామివారు గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిస్తారని తెలిపారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు

నందలూరు సౌమ్యనాథాలయంలో..

నందలూరు(రాజంపేట): జిల్లాలో వైష్ణవ ఆలయాల్లో ఒకటైన నందలూరు సౌమ్యనాథాలయం టీటీడీలోకి విలీనమైన అనంతరం తొలిసారిగా ముక్కోటి ఏకాదశిని ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి భక్తులు విశేష సంఖ్యలో రానుండటంతో, ఆ దిశగా టీటీడీ అన్ని సదుపాయాలతో ఏర్పాట్లు చేసింది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. హైవేలోని నందలూరు బస్టాండు సర్కిల్‌లో ముఖద్వారం సుందరంగా తీర్చిదిద్ది లైటింగ్ ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా టీటీడీ సన్నాహాలు చేసింది.

భక్తులకు ఉత్తరద్వార దర్శనభాగ్యం..

వైకుంఠద్వారంగా భావించే ఉత్తర ద్వారదర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఆలయంలోని ఉత్తర గాలిగోపురం నుంచి ఉత్తర ద్వారం సుందరంగా రూపొందించారు. శ్రీదేవి, భూదేవిలతో సౌమ్యనాథస్వామి ఉత్సవ మూర్తులను ఈ ద్వారదర్శనంలో వాకిలిపైభాగంలో ఉంచనున్నారు. సౌమ్యనాథాలయంలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం టీటీడీ క్యాలెండర్లు, డైరీల విక్రయాలను ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పద్మజలు ప్రారంభించారు. వీరు క్యాలెండర్లను కొనుగోలు చేసి భక్తులకు ఉచితంగా అందజేశారు.



సౌమ్యనాథాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ విజయరామరాజు



ఎస్పీ అన్బురాజన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ అధికారుల సంఘం నాయకులు

కడప సిటీ : జిల్లా అభివృద్ధికి ప్రతి అధికారి తోడ్పాటు అందించాలని కలెక్టర్ విజయరామరాజు సూచించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కలెక్టర్ విజయరామరాజుకు పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తన చాంబర్‌లో కలిసి ఆయనచే కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది అన్ని రంగాల్లో జిల్లాను ముందుకు తీసుకు వెళ్లేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. ఆ దిశగా పయనించి అభివృద్ధికి బాటలు వేద్దామని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, ఆర్డీఓలు శ్రీనివాసులు, ధర్మచంద్రారెడ్డి, నగర కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, సాంఘిక సంక్షేమ బోర్డు రాష్ట్ర చైర్మన్ పులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీకి శుభాకాంక్షలు

కడపలోని జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను ఆదివారం పలువురు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు బండారు రామకృష్ణ, యోగా రాయల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జాంబోరి సమ్మేళనానికి కడప విద్యార్థులు



జాతీయ జాంబోరి సమ్మేళనానికి జెండా ఊపి విద్యార్థులను పంపుతున్న స్కాట్ అండ్ గైడ్స్ సెక్రటరీ

కడప ఎడ్యుకేషన్: రాజస్థాన్‌లో ఈనెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న 18వ స్కాట్స్ అండ్ గైడ్స్ జాతీయ జాంబోరి సమ్మేళనానికి కడప నుంచి 80 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు స్కాట్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం కడప శంకరాపురంలోని స్కాట్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా తరపున ఆయన జెండా ఊపి విద్యార్థులను సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌటింగ్స్‌కు సంబంధించి అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని ఉత్తమ ప్రదర్శనలతో జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో స్కాట్ అండ్ గైడ్స్ ట్రెజరర్ రమణయ్య, ఏఎస్ఓ లక్ష్మీకర్, స్కాట్ మాస్టర్స్ ఖాదర్‌బాషా, బాలసుందరం, గైడ్ కెప్టెన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌లతో వృద్ధులకు చేయూత

- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి



నూతన పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెంచిన పెన్షన్ వృద్ధులకు చేయూతనిస్తుందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆకేపాడులోగల ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం నూతన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లను పెంచారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్‌ను కొనసాగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కె. శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

కలకడ సీఐగా పి.నాగేంద్ర బాధ్యతల స్వీకరణ



కలకడ : కలకడ సీఐగా పి.నాగేంద్ర ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ సురేష్‌రెడ్డి పోరుమామిళ్లకు బదిలీ అయ్యారు. ఆస్థానంలో కడప ఏసీబీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న పి. నాగేంద్ర ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు బదిలీపై కలకడ సీఐగా బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రా బౌలింగ్ అదుర్స్



తలపడుతున్న ఆంధ్ర-అరుణాచల్‌ప్రదేశ్ జట్లు




7 వికెట్లు తీసిన ఎం. ఆంజనేయులు



5 వికెట్లు తీసిన సాకేత్‌రామ్



127 పరుగులు చేసిన వంశీకృష్ణ



126 పరుగులు చేసిన మహీప్‌కుమార్

- 40 పరుగులకే అరుణాచల్‌ప్రదేశ్ ఆలౌట్
- సెంచరీలతో చెలరేగిన బ్యాట్స్‌మన్

కడప స్పోర్ట్స్: కల్నల్ సీకే నాయుడు అండర్-25 ట్రోఫీలో భాగంగా ఆదివారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆంధ్రా, అరుణాచల్ ప్రదేశ్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అరుణాచల్‌ప్రదేశ్ జట్టు 24 ఓవర్లలో 40 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని దాదో తచుంగ్ 9 పరుగులు, మగుంగ్ 8 పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్లు చెలరేగడంతో అరుణాచల్ ప్రదేశ్ జట్టు స్వల్ప స్కోరుకే ఆలౌట్ అయింది. ఆంధ్రా బౌలర్‌లు ఎం. ఆంజనేయులు 7 ఓవర్లలో 8 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీశాడు. సాకేత్‌రామ్ 6 ఓవర్లలో 6 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 1 వికెట్ నష్టానికి 61 ఓవర్లలో 264 పరుగులు చేసింది. జట్టులోని మహీప్‌కుమార్ 186 బంతుల్లో 1 సిక్సర్, 17 ఫోర్లతో 126 పరుగులు చేశాడు. ఈయనకు జతగా టి.వంశీకృష్ణ 165 బంతుల్లో 2 సిక్సర్‌లు, 19 ఫోర్లతో 127 పరుగులు చేశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రా జట్టు 224 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.

సీకే నాయుడు ట్రోఫీ ఏసీఎల్‌ఓగా శ్రీకాంత్‌రెడ్డి, కరీముల్లా



శ్రీకాంత్‌రెడ్డి



కరీముల్లాఖాన్

కడప నగరంలో నిర్వహిస్తున్న ఆంధ్రా, అరుణాచల్‌ప్రదేశ్, ఆంధ్రా, చండీఘర్ మ్యాచ్‌లకు యాంటి కరప్షన్ లైజనింగ్ ఆఫీసర్లుగా జి. శ్రీకాంత్‌రెడ్డి, పి. కరీముల్లాఖాన్‌లను నియమిస్తూ ఆంధ్రా క్రికెట్ సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్రాల అండర్-25 క్రికెట్ మ్యాచ్‌ల్లో ఎలాంటి అవినీతి కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా వీరు పరిశీలించనున్నారు.

'వాలీబాల్' మెరికలు

రామాయణంలో వాలిలా.. కడప వాలీబాలికలు ప్రత్యర్థులపై సత్తాచాటుతూ చాంపియన్‌లుగా నిలుస్తున్నారు. ఇటీవల విశాఖపట్నం జిల్లా యలమంచిలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో కడప బాలికల జట్టు స్టేట్ చాంపియన్‌గా నిలవడంతో పాటు ఏకంగా ఐదుగురు క్రీడాకారిణులు, 1 క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం విశేషం. జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్న 44వ సబ్‌జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ జట్టు నుంచి ప్రాతినిథ్యం వహించనున్నారు. వీరంతా.. సామన్య, మధ్యతరగతికి చెందిన మట్టిలో మాణిక్యాలే కావడం విశేషం. ఓవైపు చదువుకుంటూ మరోవైపు ఆటల్లో రాణిస్తున్న పేదింటి బిడ్డలపై ప్రత్యేక కథనం..

– కడప స్పోర్ట్స్

• స్టేట్‌చాంపియన్‌లుగా కడప జట్టు • ఆరుగురు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



వాలీబాల్ సాధన చిత్రాలు

పవర్‌ఫుల్.. పావని..



వైఎస్ఆర్ కడప జిల్లా బయనపల్లెకు చెందిన ఆటోడ్రైవర్ టి. సుబ్బరాయుడు, టి. రాజేశ్వరిల కుమార్తె అయిన టి. పావని వాలీబాల్‌లో సత్తా చాటుతోంది. ఇంట్లో ముగ్గురు అక్కచెల్లెలు ఉండగా అందరూ క్రీడాకారులే కావడం విశేషం. ఈమె క్రీడాపాఠశాలలో 9వ తరగతి చదువుతూ ఏపీ జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించింది. ఇప్పటికే ఒకసారి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న ఈమె మరోసారి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.

వీరబల్లి.. 'విజయ'లక్ష్మి..



వీరబల్లి మండలం మడి రాజుగారిపల్లె పంచాయతీ గుర్రప్పగారిపల్లెకు చెందిన సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఎస్. విజయలక్ష్మి ఇంటర్మీడియట్ చదువుతూ క్రీడల్లో రాణిస్తోంది. తొలిసారిగా ఈమె జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ంది. ఈమె తల్లిదండ్రులు ఎస్. శివనారాయణ, ఎస్. పార్వతి వ్యవసాయం చేస్తూ ఈమెను చదివిస్తూ, మరోవైపు క్రీడల్లో ప్రోత్సహిస్తూ ఉండటం విశేషం.

వావ్.. వాజిద్..



టి. సుండుపల్లి మండలం మడి తాటికి చెందిన ఎస్. అబ్దుల్‌వాజిద్ ఇంటర్మీడియట్ చదువుతూ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టులో చోటు దక్కించుకున్న ఏకైన జిల్లా క్రీడాకారుడు ఈయనే కావడం విశేషం. ఈయన తండ్రి ఎస్. హుజూర్‌బాషా చింతపండు వ్యాపారం చేస్తుండగా, తల్లి ఎస్. సాధికాఫాతిమ గృహిణి.

ఆటోడ్రైవర్ కూతురు.. బెస్ట్ ప్లేయర్



కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వి. కుసుమప్రియ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో చక్కటి పాయింట్లు సాధించి జిల్లా జట్టును విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించి స్టేట్ బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకుంది. ఈమె తల్లిదండ్రులు వి. సన్యాసినాయుడు ఆటోడ్రైవర్ కాగా, తల్లి వి. నాగమణి గృహిణి. వీరి సొంత జిల్లా వైజాగ్. తొలిసారిగా జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం.

రైతుబిడ్డ.. రాణిస్తోంది..



వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జె. కుముదిని దేవి వాలీబాల్ పోటీల్లో నిలకడగా రాణిస్తోంది. గతంలో సైతం రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించింది. ప్రకాశం జిల్లాకు చెందిన వ్యవసాయ రైతు జె. రవీంద్రబాబు, జె. అరుణల కుమార్తె అయిన ఈమె ప్రత్యర్థిపై అటాకింగ్ ఆడుతూ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.

లక్షణంగా రాణిస్తున్న లిఫ్టర్ లక్ష్మి..



వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి. శ్రీలక్ష్మి రెండోసారి స్టేట్ చాంపియన్‌గా నిలిచిన జట్టులో సభ్యురాలుగా నిలిచింది. టీంలో బెస్ట్ లిఫ్టర్‌గా ఉంటూ జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ంది. వైజాగ్‌కు చెందిన మెడికల్ రెప్రజెంటేటివ్ జి. విశ్వనాథమ్, రమదేవిల కుమార్తె ఈమె.

కొత్త జీవితం అందించు దేవా..!



దేవునికడపలో గ్రామోత్సవంలో స్వామి, అమ్మవారు

కడప కల్చరల్ : తిరుమలేశుని తొలి గడప దేవునికడపలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా కనిపించింది. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం 10.30 గంటల వరకు దర్శనం కోసం వచ్చిన భక్తుల సంఖ్య చాలా తక్కువగా కనిపించినా ఆ తర్వాత క్రమంగా పెరిగింది. మధ్యాహ్నం 2 గంటల వరకు రద్దీగానే కనిపించింది. దర్శనాలు రాత్రి 8 గంటల వరకు కొనసాగాయి.

తిరుమల లడ్డూ ప్రసాదం సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. క్యాలెండర్లు కూడా అతి స్వల్ప సంఖ్యలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

ఇంకా పలు ఆలయాల్లో..

కడప నగర శివార్లలోని శ్రీ లలితాంబిక ఆలయం, శ్రీ విజయదుర్గాదేవి ఆలయం, శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం, కో ఆపరేటివ్ కాలనీలోగల శ్రీ షిరిడిసాయిబాబా దేవాలయంలో స్వాములు, అమ్మవారులకు విశేష పూజలు చేశారు. ఉదయం మూలమూర్తికి అభిషేకాలు, అనంతరం అలంకారం చేసి భక్తుల దర్శనాలకు అనుమతించారు. స్థానిక పాత బస్టాండులోని శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ఉదయం స్వామి మూలమూర్తికి పంచామృతాభిషేకం చేసి విశేష అలంకారం చేశారు. అనంతరం ఆకుపూజ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్ వద్ద గల ఆంజనేయస్వామి ఆలయంలో కూడా భక్తులు తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. నగరంలోని ఇంకా పలు దేవాలయాల్లో విశేష పూజలు చేయడంతో భక్తులు దర్శించుకుని సంవత్సరమంతా తమ కుటుంబాలను చల్లగా చూడాలని ప్రార్థించారు.

ఒంటిమిట్టలో అన్నదాన వితరణ ప్రారంభం



అన్నప్రసాద వితరణ కేంద్రంలోని వంట గదిలో పూజలు చేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి క్షేత్రం ఎదురుగా ఉన్న రామకుటీరంలో ఆదివారం టీటీడీ వారి అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది. ముందుగా నూతన వంటశాలలో శ్రీరాముల వారు, శ్రీ లక్ష్మీదేవి చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు, అర్చకులు వీణారాఘవాచార్యులు, శ్రావణ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా జిల్లా పర్యాటకం



నూతన సంవత్సర వేడుకలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి దిశగా వెళుతోందని నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు, ఎంఎం ఆస్పత్రి అధినేత డాక్టర్ మహబూబ్‌పీర్ అన్నారు. నూతన సంవత్సర సందర్భంగా రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాయలసీమ టూరిజం సంస్థ ఇటీవల మరికొన్ని సంస్థలను కలుపుకుని బలోపేతం కావడం సంతోషదాయకమన్నారు. ఇటీవల గండికోటలో ఒబెరాయ్ సంస్థ హోటల్స్ నిర్మించేందుకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. సభాధ్యక్షుడు లయన్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఇంతవరకు రాయలసీమ సంస్థ ఒక్కటే జిల్లా పర్యాటకాభివృద్ధికి కృషి చేసిందని, ఇప్పుడు లయన్స్ క్లబ్‌తో పాటు పలు ప్రముఖ సంస్థలు కూడా ముందుకు వస్తుండడం సీమ సంస్థ పట్ల గల విశ్వాసమే కారణమన్నారు. ప్రత్యేక అతిథి, యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో పర్యాటక ప్రాంతాలను కలుపుతూ బస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

సంస్థ ప్యాట్రన్ పిచ్చయ్యచౌదరి మాట్లాడుతూ తాను మిత్రుల ప్రోత్సాహంతో రాసిన ట్రావెలాగ్‌ను త్వరలో ఆవిష్కరిస్తున్నామన్నారు. చీఫ్ ప్యాట్రన్ పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా రాయలసీమ సంస్థ జిల్లాలో పర్యాటక అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. రిటైర్డ్ ఇంజినీరు వెంకటరెడ్డి, సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, కోశాధికారి బాలగొండ గంగాధర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తాను రాసిన కథకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రథమ బహుమతి రావడంతో సంస్థ సభ్యుడు షబ్బీర్ హుసేన్‌ను ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండర్ విడుదల



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.నాగరాజు

బద్వేలు అర్బన్ : బద్వేలు తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం కడపలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజులు వేర్వేరుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బద్వేలు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు సి.హుస్సేనయ్య, ఎస్.పుష్పరాజ్‌లు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అవసరమైన జీవోలతో పాటు ప్రభుత్వ సెలవుదినాలు పొందుపరిచి రూపొందించిన క్యాలెండర్ వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రమేష్‌కుమార్, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సిద్దవటం తాలూకా అధ్యక్షులు మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలోని రాజమహేంద్ర ఇంటర్నేషనల్ స్కూల్‌లో 66వ రాష్ట్రస్థాయి ఎస్జీఫ్ రైఫిల్ షూటింగ్‌పోటీల్లో వైఎస్సార్ జిల్లాకు చెందిన 8 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–19 విభాగంలో షేక్ మొహమ్మద్ ఉబేద్, రాజేశ్వరి, అండర్–17 విభాగంలో యశ్వంత్, శశాంక్ రెడ్డి, సుల్తాన్, లక్ష్మీ కుమారి, రాజేశ్వరి, అండర్–14 విభాగంలో సుహానా జాగృతి జాతీయ స్థాయి రైఫిల్ పోటీలకు ఎంపికయ్యారని రైఫిల్ షూటింగ్ శిక్షకుడు రాఘవ తెలిపారు. విద్యార్థులకు పలువురు అభినందనలు తెలిపారు.

బైక్, కారు ఢీ: వ్యక్తిమృతి



సుబ్బరాయుడు నాయక్ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండలపరిధిలోని ముద్దనూర్ రహదారిలో బైక్‌ను కారు ఢీకొనడంతో చిటిమిటిచింతల (పాటి) గ్రామానికి చెందిన బుక్కే సుబ్బరాయుడు నాయక్ (47) మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ సుబ్బారావు కథనం మేరకు బుక్కే సుబ్బరాయుడు నాయక్ ఆదివారం సాయంత్రం సొంత పనుల నిమిత్తం జమ్మలమడుగు పట్టణానికి వచ్చాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి బైక్‌లో వెళుతుండగా చిటిమిటిచింతల టోల్‌గేట్ సమీపంలోకి ముద్దనూర్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన సుబ్బరాయుడు నాయక్‌ను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళుతుంగా మృతిచెందాడు. ఇతనికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విషగుళికలు తిని ఆత్మహత్య



చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహం

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన నారు చంద్రశేఖర్‌రెడ్డి (57) అనే వ్యక్తి విషపు గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రశేఖర్‌రెడ్డి కొన్ని రోజులుగా తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతుండేవాడు. ఆ నొప్పి వల్ల ఎడమ చేయి, కాలు చచ్చుపడిపోయాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది పంట పొలం కోసం తెచ్చిన విషపు గుళికలను ఆదివారం మింగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుమారుడు భాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజగోపాల్ తెలిపారు.చంద్రశేఖర్‌రెడ్డికి భార్య వెంకటరమణమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైలు నుంచి పడి వృద్ధురాలి దుర్మరణం



తులశమ్మ మృతదేహం

ఎర్రగుంట్ల : పింఛన్ డబ్బులు తీసుకోవడానికి స్వగ్రామానికి రైలులో వెళుతుండగా కిందపడి బానమతి తులశమ్మ(60) మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలం పరిధిలోని సున్నపురాళ్ల గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎర్రగుంట్ల జీఆర్‌పీ ఎస్ఐ కేఎస్ వర్మ కథనం మేరకు కర్నూల్ జిల్లా పత్తికొండ మండల సోనారతాండ గ్రామానికి చెందిన బానమతి తులశమ్మ రైల్వే కోడూరులోని నివాసం ఉంటున్న కుమారుడు రవినాయక్ వద్ద ఉంటోంది. వీరు కూలి పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. 1వ తేదీ కావడంతో పింఛన్ డబ్బులు తీసుకోవడానికి తన స్వగ్రామానికి రైలులో బయలు దేరింది. యర్రగుంట్ల మండలం పరిధిలోని సున్నపురాళ్ల గ్రామం సమీపంలోకి రాగానే రైలులో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎర్రగుంట్ల జీఆర్‌పీ ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టర్ కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రూ.4 కోట్లకు పైగా మద్యం తాగేశారు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : 2023 నూతన సంవత్సరాన్ని పురష్కరించుకొని మద్యం ప్రియులు జిల్లాలో 2022 డిసెంబర్ 31న రూ. 4,77,65,900 మద్యాన్ని తాగారు. ఇందులో 4463 కేసుల మద్యంకు గాను రూ. 4,27,66,370 విలువ కాగా బీర్లు 1821 కేసులకు గాను రూ.49,99,530 లక్షల అమ్మకాలు జరిగినట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపో మేనేజర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. దాదాపు జిల్లాలో లిక్కర్, బీర్ల రూపంలో రూ. 4, 77, 65, 900 అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన ఉమామహేశ్వరరెడ్డి

వేంపల్లె : వేంపల్లె పట్టణ సమీపంలోని పాములూరు గుట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రెండు బైకులు ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె మండలం అమ్మగారిపల్లె గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరెడ్డి పని నిమిత్తం బైక్‌లో వేంపల్లెకు బయలుదేరాడు. చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లె చెందిన రామసుబ్బయ్య బైకులో వస్తున్నాడు. రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరరెడ్డి, రామసుబ్బయ్యకు తోడుగా వస్తున్న ఝార్ఖండ్‌కు చెందిన ఉపేంద్రనాథ్ ఠాకూర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డ్యూక్‌బైక్ తెచ్చిన అనర్థం







శంకరరెడ్డి మృతదేహం, గాయపడిన యువకుడు ఈశ్వర్, ప్రమాదానికి కారణమైన డ్యూక్‌బైక్

ద్విచక్రవాహనాన్ని ఢీనడంతో వ్యక్తి మృతి

మదనపల్లె : డ్యూక్‌బైక్‌ను రోడ్డుపై వేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. భర్త అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె పట్టణం కదిరిరోడ్డులో జరిగింది. కృష్ణానగర్‌కు చెందిన పద్మనాభ కెనడీ కుమారుడు ఈశ్వర్ కలికిరి జేఎన్‌టీయూలో బీటెక్ చదువుతున్నాడు. పద్మనాభ కెనడీ ఈశ్వర్‌కు నెలరోజుల క్రితం డ్యూక్‌బైక్‌ను కొనిచ్చాడు. ఆదివారం ఉదయం ఈశ్వర్ బైకులో నీరుగట్టువారిపల్లె నుంచి పట్టణంలోకి మెరుపువేగంతో వస్తున్నాడు. అదేసమయానికి ప్రశాంత్‌నగర్ సెకండ్‌క్రాస్‌లో నివాసం ఉంటున్న ఎస్.శంకర్‌రెడ్డి(50), భార్య జానకితో కలిసి ద్విచక్రవాహనంలో ములకలచెరువులో బంధువుల దశదినకర్మలకు హాజరయ్యేందుకు బయలుదేరాడు. ఈక్రమంలో ప్రశాంత్‌నగర్ ఫస్ట్‌క్రాస్ నుంచి మెయిన్ రోడ్డులోకి వస్తుండగా, అతివేగంగా వచ్చిన ఈశ్వర్ బైక్ శంకర్‌రెడ్డి వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో శంకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, భార్య జానకి తీవ్రంగా గాయపడింది.

ఇదే ఘటనలో బైక్ నడుపుతున్న ఈశ్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈశ్వర్ తన వాహనాన్ని విపరీతమైన వేగంతో నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని, ప్రమాదధాటికి రెండు వాహనాలు పూర్తిగా దెబ్బతినడంతో ఢీకొట్టిన వేగం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈశ్వర్‌ను మెరుగైన చికిత్సల కోసం తల్లిదండ్రులు బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.